నేటి నుంచి జేఎన్‌టీయూలో జాతీయ గీతాలాపన

బాలానగర్: విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు జేఎన్‌టీయూ క్యాంపస్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయకుమార్‌రెడ్డి జాతీయ గీతం అందరికీ వినిపించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు కూడా క్యాంపస్‌లో జాతీయ గీతం ఆలపించటం వల్ల ఉద్యోగుల్లో, విద్యార్థుల్లో ఓ ఉత్తేజం వస్తుందన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు వారు పాఠశాలలో విద్యనభ్యసించే కాలంలో ఈ జాతీయగీతం ఆలపించి వందన సమర్పణ చేసి తరగతులకు వెళ్లి చదువు సాగించే వారమన్నారు.

◆ నేడు విద్యార్థులు ఎక్కువ సమయం ఫోన్, మరో వ్యాపకంతో అసలు జాతీయ గీతం దాని ప్రాధాన్యత విలువ గౌరవం మరిచిపోతున్నారని అన్నారు. క్యాంపస్‌లో ప్రవేశించిన ప్రతి ఒక్కరూ కూడా జాతీయ గీతం వస్తున్న సమయంలో తప్పకుండా నిలబడి వందన సమర్పణ చేయాలి అని తెలిపారు.

◆ ఈ సందర్భంగా వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ డా.విజయకుమార్ రెడ్డి మంచి సంప్రదాయానికి విద్యార్థులను సిద్ధం చేయటం సంతోషకరమైన విషయం అన్నారు. జాతీయ గీతం వింటున్న సమయంలో తనకు పాఠశాల రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. జాతీయ గీతం ఆలపించటం వల్ల మనకు ఎంతో సంతోషం కలుగుతుందన్నారు.

◆ యూనివర్సిటీలో జాతీయ గీతం నిత్యం కొనసాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రొఫెసర్లు, యూనివర్సిటీ ఉన్నతాధికారులు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు అందరు జాతీయ గీతాలాపనలో పాల్గొనాలని కోరారు.



వైభవంగా సహస్ర రుద్ర సహిత చండీయాగం

హఫీజ్‌పేట్ : చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత లక్ష్మీ గణపతి దేవాలయంలో శ్రీ సహస్ర రుద్ర సహిత సహస్ర చండీయాగం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు సప్తాహ్నిక దీక్షతో ఏడు రోజుల పాటు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సత్యసాయి పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ వేదులు పవన్‌కుమార్ శర్మ, మురళీధరశర్మ ఆధ్వర్యంలో చండీ ఉపాసకులతో ఋత్విక్కులతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ విఘ్నేశ్వర పూజ పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన దీక్షాధారణ గోపూజ, అఖండ దీపారాధన వాస్తుపూజ, వాస్తు హోమం, యాగశాల ప్రదక్షణ తదితరాలను నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు చండీయాగ సంకల్పము, హోమం, బలిహరణ, రాత్రి 8 గంటలకు నీరాజనం మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు.

చెత్తా చెదారం.. తొలగించడంలో విఫలం

మోతీనగర్: గత కొన్ని రోజుల నుంచి ఎన్నికల హడావుడి పేరుతో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించకపోవటంతో ఎటు చూసినా చెత్తాచెదారం పేరుకుపోతోంది. మూసాపేట సర్కిల్ మోతీనగర్ అల్లాపూర్ ప్రాంతాల్లో ఏ బస్తీ, కాలనీలో చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. సుమారు నెల రోజుల నుంచి ఎన్నికల పేరిట కొంత మంది సిబ్బందిని ఎన్నికల విధుల పేరుతో వినియోగించుకున్నారు. మిగిలిన సిబ్బంది ఇదే అదనుగా భావించి వారు చేస్తున్న పనిని తూతూమంత్రంగా విధులు నిర్వహించారు.



గాయత్రినగర్ నాలుగు కూడళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం

◆ ప్రభుత్వం మారినా నూతన ప్రభుత్వం ఏర్పడినా జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తే కిందిస్థాయి సిబ్బందిలో ఏ మాత్రం మార్పు కనిపించటం లేదని ఆయా కాలనీవాసులు మండిపడుతున్నారు. వారం రోజుల కిందట నూతన ప్రభుత్వం ఏర్పడిన రోజు ప్రజలు గత ప్రభుత్వానికి భిన్నంగా అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ సిబ్బంది కృషి చేస్తారని ఎంతో భావించారు. కానీ సిబ్బందిలో ఏ మాత్రం చలనం లేదు. గత ప్రభుత్వం నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికినా చివరికి విశ్వ నగరం ఎటు పోయిందో కానీ చెత్త నగరంగా తయారైందని పలువురు వాపోతున్నారు.

◆ గాయత్రినగర్, పర్వత్‌నగర్‌చౌరస్తా, స్నేహపురికాలనీ, బబ్బుగూడ, అవంతినగర్ తోట, శివబస్తీ, ఏజీ గ్లాస్ ఫ్యాక్టరీ ప్రహరీ పక్కన పలు బస్తీ, కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. వాటిని తొలగించే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెత్తాచెదారం తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి భరత్‌రెడ్డి



కూకట్‌పల్లి: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పడమటి భరత్‌రెడ్డి గురువారం నియమితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీలో జరుగుతున్న ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలు, 42వ తెలంగాణ రాష్ట్ర మహా సభల సందర్భంగా తెలంగాణ ప్రాంత రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి అతడిని నియమించారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని భరత్‌రెడ్డి తెలిపారు.

ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా సురేష్‌యాదవ్



హర్యానా మాజీ మంత్రితో సురేష్

కూకట్‌పల్లి: టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా యూవీ సురేష్‌యాదవ్‌ను ఏఐసీసీ నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, హర్యానా మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ డిపార్టుమెంట్ వర్కింగ్ చైర్మన్‌గా నియమించినందుకు ఏఐసీసీ, టీపీసీసీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని సురేష్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఓబీసీల సంక్షేమానికి తాను కృషి చేస్తానని ఆయన అన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ సాయివైభవ్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో కాలనీవాసులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గాంధీ, శ్యామలాదేవి దంపతులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సాయివైభవ్, సాయిఐశ్వర్య కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి సమస్య శాశ్వతప్రాతిపదికన తీర్చడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, కాలనీ కార్యదర్శి పద్మావతి, నాయకులు గణేష్‌ముదిరాజ్, నిహారిక, గ్రీన్ గ్రేస్, అపర్ణ వెస్ట్‌సైడ్, సాయిఐశ్వర్య కాలనీ, ఇతర గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ల ప్రతినిధులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

రాయదుర్గం: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని బసవతారకనగర్, కేశవనగర్‌బస్తీలలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బసవతారకనగర్‌బస్తీ ప్రజలకు పట్టాలు, కరెంట్ మీటర్లు, నల్లా కనెక్షన్లు వచ్చేలా చూస్తామన్నారు. కేశవనగర్‌బస్తీలో పట్టాలు రాని ప్రజలకు న్యాయం చేసేలా చూస్తామన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, సత్యంగౌడ్, రమేష్, అనిల్, రాధాకృష్ణ, వెంకటేష్, మహేష్, శ్రీశైలం, నర్సింహ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా కాలనీలోని రెండ వీధుల్లో పెండిగ్‌లో ఉన్న సీసీ రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నిరంజన్ యాదవ్, ధాతి రమేష్, షౌకత్‌అలీ మున్నా, మల్లేష్, పోశెట్టి గౌడ్, ఫారూఖ్, ఖలీమ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత...

ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలో నివసించే ఓ వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.



మహంకాళినగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఓయూ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు నాగేశ్వర్‌రావు, సుమంత్ మాట్లాడారు. ఓయూ అభివృద్ధికి విద్యార్థులు రూపొందించిన ఏజెండాను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్స్ ఏజెండా అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రుక్మత్ పాషా, సంపత్, మహేష్, కాంత్రి, సంతోష్, సుమన్, నరేష్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: దిశ, కేంద్ర ప్రభుత్వ డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) సంయుక్తంగా ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని దిశ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధి కార్యాలయ యువ అధికారి విజయ్, బీఎస్‌కే డైరెక్టర్ శరత్‌బాబు, దిశ కో–ఆర్డినేటర్లు ఐవాన్‌వాజ్, స్టీవ న్ వెల్లడించారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీ, డిప్లొమా విద్యార్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని మరి న్ని వివరాలకు 89771 75394, 94946 98219 నం సంప్రదించాలన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 55, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 45, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 70, గోకరకాయ 55, కీర 21, దోసకాయ 25, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

దంత వైద్యంపై అంతర్జాతీయ సదస్సు



మెడికవర్ ఆసుపత్రిలో సదస్సును ప్రారంభించిన డా.శరత్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: ఆక్సిజన్ థెరపీ అనేది డెంటిస్ట్రీలో ముఖ్యంగా ఇంప్లాంటాలజీలో ఒక విప్లవాత్మక విధానం అని మెడికవర్ హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం దంత వైద్యం, ఇంప్లాంటాలజీలో ఆక్సిజన్ థెరపీపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను మెడికవర్ దంత వైద్య విభాగం నిర్వహించింది. ఈ సదస్సులో వివిధ ఆసుపత్రుల నుంచి 100 మందికి పైగా దంతవైద్య నిపుణులు పాల్గొన్నారు. యూకే నుంచి డాక్టర్ మినాస్ లెవెన్స్కీ, డాక్టర్ జోహాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ యూకే, ఇతర దేశాల నిపుణులతో అంతర్జాతీయ అనుభవాలు, దంత వైద్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడానికి హైదరాబాద్‌లోని దంత వైద్యులకు వర్క్‌షాప్ ఒక వేదికను అందించిందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ డెంటల్ సైన్సెస్ హెడ్ డాక్టర్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత కార్యకర్తలు, నాయకులదేనని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ సభ్యులతో ఆయన సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని కాలనీ,బస్తీ నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలన్నారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటినుంచే కాంగ్రెస్ పార్టీ అన్ని చోట్లా మెజార్టీ సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులందరికీ అండగా ఉంటామని, అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి సురేందర్, రాధాకృష్ణ, రాజు, వెంకటేష్ ,అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



8వ బెటాలియన్‌లో మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కమాండెంట్ సన్నీ

గచ్చిబౌలి: పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణలో కీలకపాత్ర పోషించేందుకు అవకాశం ఉంటుందని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సి సన్నీ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను బెటాలియన్ యూనిట్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ క్యాంప్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాయామం, యోగా, నడకతో బాటు మంచి ఆహారపు అలవాట్లను పాటించాలన్నారు. హెల్త్ క్యాంప్‌లో బెటాలియన్ సిబ్బందికి కార్డియాలజీ ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, న్యూరో వెస్కులర్ తదితరాలపై ఉచిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్ యూనిట్ డాక్టర్ జ్యోతిబాపులే, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, ఏఐజీ ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలి

● ఉపకమిషనర్ వంశీకృష్ణ



పారిశుద్ధ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉపకమిషనర్

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్– 21 పరిధిలో శానిటేషన్ విభాగం సిబ్బంది పనితీరుపై ఏఎంహెచ్ఓ డాక్టర్ కార్తీక్, సిబ్బందితో గురువారం ఉపకమిషనర్ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రధానరోడ్లపై చెత్త తొలగింపు, పిన్ పాయింట్‌ల వద్ద సిబ్బంది పర్యవేక్షణను ఎస్ఎఫ్ఐ, ఎస్ఆర్‌పిలు గమనించాలన్నారు. ఎప్పటికప్పుడు రోడ్లపై చెత్తను తరలించాలన్నారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎంహెచ్ఓ, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఓయూ క్యాంపస్ కొత్త విద్యార్థుల కోలాహలం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో కొత్త విద్యార్థుల రాకతో యూనివర్సిటీ అంతట కోలాహలంగా మారింది. యూనివర్సిటీ క్యాంపస్‌లోని 9 కాలేజీలో నూతన విద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీల విద్యార్థులు మొదలు ఎంబీఏ, ఎంఈఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఈడీ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలో ప్రవేశాలు, చివరకు లా కాలేజీ విద్యార్థుల చేరికతో క్యాంపస్ అంతా విద్యార్థులతో కళకళలాడుతోంది. ఓయూలో అన్ని రకాల మౌలిక వసతులున్నా అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ఓయూ సాహిత్య వేదిక వార్షికోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సాహిత్య వేదిక 6వ వార్షికోత్సవం కవులు, కళాకారులు, రచయితలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటలు, పద్యాలు, వచన కవితలతో సాహిత్యాభిలాషులను అలరించారు. తెలుగుశాఖ అధ్యాపకులు ప్రొ.కాశీం, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అక్కిరాజు రామకృష్ణారావు, యామిని, రమేష్, రేలారే గంటా తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఓయూలో బారికేడ్ల జగడం



విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గతంలో ఏర్పాటు చేసిన ముళ్ల కంచెలు, బారికేడ్లను తొలగించాలని విద్యార్థులు వారం రోజులుగా చేపట్టిన ఆందోళన తీవ్రరూపం దాల్చింది. గురువారం ఐక్య విద్యార్థుల ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ చేపట్టారు. పరిపాలన భవనం గేట్లు మూసివేయడంతో ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఓయూలో ఏర్పాటు చేసిన పోలీసుల బారికేడ్ల, పరిపాలన భవనానికి అమర్చిన ఇనుప ముళ్ల కంచెను తొలగించి ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ వీసీ ప్రొ.రవీందర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. పాలన భవనం చుట్టూ ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను తొలగించేందుకు యత్నించిన విద్యార్థులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థులకు నడుమ పెనుగులాట జరిగింది. విద్యార్థులకు మద్దతుగా లా కాలేజీ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ పాల్గొని అధికారుల తీరు పై మండిపడ్డారు. కార్యక్రమంలో బైరు నాగరాజుగౌడ్, నెల్లి.సత్య, గ్యార నరేష్, ఆజాద్, వలిగొండ నరసింహ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులను ఆదుకోవాలి

పంజగుట్ట: శబరిమలలో తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులు మంచినీరు, ఆహారం, వైద్య సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేరళ ప్రభుత్వంతో మాట్లాడి అయ్యప్ప భక్తులను కాపాడాలని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్లు ఎస్.బుచ్చిరెడ్డి గురుస్వామి,బాలకృష్ణ గురుస్వామి, రాధాకృష్ణ, ప్రేమ్‌గాంధీ మాట్లాడుతూ కేరళ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ సంవత్సరం అయ్యప్ప భక్తులు ఇబ్బంది పడుతూ దర్శనం కోసం క్యూలైన్‌లో చిక్కుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఎరుమేలి నుంచి పంబాకు వెళ్తే మార్గంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించక పోవడంవల్ల అయ్యప్ప స్వాముల వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయన్నారు. దీంతో మంచినీరు, ఆహారం లేక వాహనాల్లోనే స్వాములు నరకయాతనకు గురవుతున్నారన్నారు. పరిమితికి మించిన దర్శనం టోకెన్లు ఇవ్వడం వల్ల తీవ్రమైన రద్దీ కారణంగా పంబా నుంచి సన్నిధానం వెళ్లేందుకు అయ్యప్ప దర్శనం కోసం క్యూలైన్‌లో గంటల తరబడి చిక్కుకుని వేలాదిగా అయ్యప్ప భక్తులు నీరు, ఆహారం, వైద్య సదుపాయం లేక తొక్కిసలాటలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని శబరి యాత్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ధార్మిక సంఘాలు మంచినీరు, ఆహారం అందిస్తామని స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నా కేరళ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒక ప్రత్యేక బృందాన్ని శబరికి పంపించి సహాయక చర్యలు చేపట్టాలని, ప్రత్యేక బస్సులు, రైళ్లు ఏర్పాటు చేసి ప్రతి భక్తుడినీ క్షేమంగా తీసుకురావాలని సూచించారు. అయ్యప్ప భక్తులు రమణ, ఈశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల ప్రగతిపై ప్రతివారం సమావేశం

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, పంచాయతీరాజ్ ఈఈ సుమేధా, ఆర్డీవోలు శ్యాంప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ), సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు పడక గదుల నిర్మాణాలకు సంబంధించి అన్ని వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

◆ ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తయ్యాయి..? ఎన్ని ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు..? ఇంకా ఎన్ని ఇళ్లు ఏ దశలో పెండింగ్ పనులు ఉన్నాయి? ఫినిషింగ్ దశలో ఎన్ని ఉన్నాయనే పూర్తి వివరాలను నియోజకవర్గాల అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందజేసే డబుల్ ఇళ్లను తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం అందజేయాలని సూచించారు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల కేటాయింపులకు సంబంధించిన వివరాలు, పంపిణీ ప్రక్రియను తెలుసుకున్నారు. రాజీవ్ గృహకల్ప ఇళ్లపై ఆయన ఆరా తీశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేయాలని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

◆ ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని, సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో తప్పకుండా హాజరుకావాలన్నారు. అర్హులకు అందజేయనున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు శ్యామ్ ప్రకాశ్, రాజేశ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) అధికారులు పాల్గొన్నారు.

తులసీనగర్.. చీకటిమయం

వీధి లైట్లు వెలగక అంధకారం

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ దీపాలు వెలగక అంధకారంలో మగ్గుతున్నామని తులసినగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లో కొన్ని వారాలుగా విద్యుత్ దీపాలు వెలగక వీధుల్లో చీకటి అలుముకుందని వాపోయారు. అసలే దొంగల బెడదతో భయపడుతున్నామని మొరపెట్టుకుంటున్నారు. గతంలో ఈ కాలనీలో రాత్రి వేళ దొంగతనాలనికి పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయని, ఇళ్ల ముందు బైక్‌లు పార్కింగ్ చేస్తే పెట్రోల్ ఎత్తుకెళుతున్న సంఘటనలు కూడా కెమెరాల్లో కనిపించాయని చెప్పారు. తులసినగర్ ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. వీధి దీపాలు లేక సీసీ కెమెరాలు కూడా కాలనీలో సంచరించే వారిని గుర్తించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.





అంధకారంలో తులసీనగర్